క్లుప్తంగా

శిథిల భవనాలు తొలగింపు



గొల్లబజార్‌లో శిథిల భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: శిథిలమైన భవనాలు భారీ వర్షాలతో కూలే ప్రమాదం ఉన్నందున తొలగిస్తున్నారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో శనివారం నగరంలోని ఆరు భవనాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. రోటరీనగర్‌లో మూడు, బీ.కే.బజార్, ఖానాపురం, గొల్లబజారులో ఒక్కో భవనాన్ని కూల్చివేసినట్లు తెలిపారు.

మాజీ మంత్రి పువ్వాడ పరామర్శ

రఘునాథపాలెం: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వీవీపాలెం సొసైటీ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు కుతుంబాక బసవ నారాయణ కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించి నారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుతుంబాక నరేష్, దానయ్య, బసవనారాయణ కుమారులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ సిటిజెన్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన గాంధీ పార్కులోని సంఘ కార్యాలయంలో 21మంది ఉపాధ్యాయులకు సన్మానించింది. ఈ కార్యక్రమంలో వి.లక్ష్మయ్య, తాతారాఘవయ్య, సంత్య నారాయణరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సాధినేని జనార్దన్‌రావు, సూర్యప్రకాశరావు, నరసయ్య, శ్రీహరి, రాధాకృష్ణ, జెల్లా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌గౌడ్ నియామకంపై హర్షం

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం పట్ల నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీల సముచితస్థానం ఇచ్చిందని, రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు పీసీసీ పదవి ఇచ్చి అధిష్టానం న్యాయం చేసిందని పేర్కొంటూ మహేష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ బాధ్యులు

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు గ్రామ పంచాయతీ కార్మికుడు రాచమంటి కోటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా శుక్రవారం గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యాన మృతుడు కుటుంబానికి రూ.7వేల నగదు అందించారు. అంతేకాక గ్రామ యాదవ సంఘం తరపున రూ.14 వేల విలువైన సామగ్రి అందించినట్లు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ద గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
సాయిరాం	ఉరుకు పటేల
ఆదిత్య	ఆయ్
శ్రీనివాస	35(2024)
సీఎస్ సినీ గెలాక్సీ	కమిటీ కుర్రోళ్లు, డి.కాలనీ2

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	150		20
బీర	60	తోటకూర	3
దొండ	34		20
పొట్లకాయ	50	గోంగూర	5
చిక్కుడు	76		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	38	కొత్తిమీర	1
ఆలుగడ్డ	44		40
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	76		20
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

చవితి సందడి షురూ..!

వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- భిన్నమైన ఆకృతుల్లో ప్రతిమలు
- సైజు, రకాన్ని బట్టి ధరలు
- పూలు, పూజా సామగ్రికి గిరాకీ
- ముస్తాబైన మండపాలు

ఖమ్మంగాంధీచౌక్: విఘ్నాలు తొలగించే వినాయక చవితి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరుపుకునేందుకు భక్తజనం సిద్ధమైంది. దీంతో ఏ వీధిలో చూసినా వినాయక విగ్రహాల సందడే కనిపిస్తోంది. ఈనేపథ్యాన శనివారం వినాయక చవితి పండగ మొదలు కానుండగా.. గణపతి విగ్రహాలు, పత్రి, పూలు, కాయల విక్రయాలతో మార్కెట్ అంతా కళకళలాడుతోంది. అయితే వరదల కారణంగా నగరంలోని మున్నేరు నది పరీవాహక ప్రాంతం ముంపునకు గురి కావడంతో అక్కడ వినాయక చవితి సందడి దూరమైంది. కాగా, ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు, మేధావులు మట్టి విగ్రహాలను ఉత్సవాల్లో వినియోగించాలని ప్రచారం చేయడంతో మట్టి గణపతి ప్రతిమలకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల కంటే మట్టి విగ్రహాలకు ధర ఎక్కువగా ఉండడం విశేషం. గణనాథుడిని ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన భారీ సెట్టింగ్‌లతో మండపాలను ఏర్పాటు చేసుకున్నారు.

భిన్నమైన అలంకరణలు..

వినాయక విగ్రహాలను వ్యాపారంగా మలుచుకున్న కొందరు వ్యాపారులు వివిధ రకాల సైజులు, ఆకృతుల్లో విగ్రహాలు తయారు చేయించడం, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ చిన్న విగ్రహాలు రూ.180 మొదలు రూ.2,500ల వరకు ఉండగా.. మట్టి విగ్రహాలు చిన్నవి రూ.250 మొదలు రూ.4 వేల వరకు ధర పలుకుతున్నాయి. ఇక ఐదు అడుగుల నుంచి తొమ్మిది అడుగుల మట్టి విగ్రహాల ధరలు రూ.15 వేలు మొదలు రూ.35 వేల వరకు ఉన్నాయి.

జోరుగా విక్రయాలు..

వినాయక విగ్రహాలతో పాటు పూజా సామగ్రికి కూడా గిరాకీ పెరిగింది. విగ్రహాలను బట్టి ప్రత్యేకంగా దండలు తయారు చేస్తుండగా.. పట్టు వస్త్రాలు, తెల్ల దుస్తులు, లాల్చీ, పైజామాలు, టోపీలు, వినాయక టీ షర్టులు, మంచి గుమ్మడి కాయలు, పూలు, పత్రి, పండ్లు విక్రయిస్తున్నారు. అటవీ ప్రాంతాలు, గ్రామాల నుంచి పూలు, ఆకులను తీసుకొచ్చి రహదారుల వెంట అమ్ముతున్నారు. అయితే పత్రి, కాయల ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయని విక్రయదారులు చెబుతున్నారు. వీటిని అడవులు, గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చినా రూ.50 నుంచిరూ.70 వరకే ధర పలుకున్నాయని చెబుతున్నారు. వీటిలో ప్రధానంగా మామిడి తోరణాలు, ఆకులు, తంగేడు, ధర్మగడ్డి, జిల్లేడు ఆకులు, ముష్టి, తుమ్మి, ఏనుగు దంతాల కాయలు, శీతాఫలం, వెలగ, కరక్కాయలు, గరిక, మర్రి ఊడలు, ఉమ్మెత్త, మారేడు తదితర రకాల కాయలు, విక్రయిస్తున్నారు.



ఖమ్మంలో చిన్న వినాయక విగ్రహాల విక్రయాలు



పత్రి, కాయల విక్రయాలు



నేలకొండపల్లి: విగ్రహాన్ని లారీలో ఎక్కిస్తున్న దృశ్యం



ఖమ్మం బోస్‌బొమ్మ సెంటర్‌లోని ఓ మండపం

పూలు, పండ్లకు గిరాకీ..

వినాయక పూజా సామగ్రిలో పూలు, పండ్లకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఇందులో బంతి పూలు ఎక్కువగా అమ్ముతుండగా.. కిలో బంతి పూల ధర రూ.120 నుంచి రూ.170 వరకు ఉండేది కాస్తా.. పండగ నేపథ్యాన రూ.250 నుంచి రూ.350 వరకు పెంచారు. నాలుగు అడుగుల బంతి పూల దండను రూ.400ల నుంచి రూ.600లకు పెంచారు. సాధారణ రోజుల్లో రూ.300 నుంచి రూ.350లు ఉండేది. ఇక గజమాలల ధర అయితే 7 నుంచి 10 అడుగులుండే రూ.900 పలుకుతుండగా.. వీటిలో గులాబీ పూలు, ఇతర పూలను అమర్చితే రూ.1000కి పైనే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అంతేకాక అరటి, దానిమ్మ, బత్తాయి వంటి పండ్లకు గిరాకీ పెరడంతో డజను అరటి రూ.60కి పైగా ఉండగా, నాలుగు ఆపిల్ పండ్లు రూ.160 చెబుతున్నారు. ఇక వినాయక విగ్రహం పక్కన వెలిగించే మట్టి కుందులు సైజును బట్టి రూ.40 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ..

ఖమ్మంఅర్బన్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇందిరానగర్ వాసవీ రైస్ షాపు వద్ద వాసవీ క్లబ్ రోటరీనగర్ ఆధ్వర్యాన శుక్రవారం 500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ విగ్రహాలను అధ్యక్షుడు సోమశేషగిరి రావు, ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల హనుమంత రావు, కోశాధికారి తల్లాడ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో క్లబ్ గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, రాయల సతీష్, బాబు ఈశ్వరి, 12 డివిజన్ కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు తదితరులు పాల్గొని పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు కేసీగుప్తా జయంతి, జర్నలిస్ట్ డే సందర్భంగా క్లబ్ ఆధ్వర్యాన పలువురి జర్నలిస్ట్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ ట్రెజరర్ మాశెట్టి వరప్రసాద్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు కొదుమూరి జగన్నాథం, మాశెట్టి తిరుమలరావు, కొదుమూరి శ్రీనివాస రావు, జిల్లా ఆఫీసర్లు కొత్తూరు రమేష్, రాయల బసవేశ్వరరావు, శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అంతేకాక బొమ్మ కాలేజీ విద్యా సంస్థల ఆధ్వర్యాన కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వర రావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్ తదితరులు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ బాధ్యులు

వరదతో అతలాకుతలం..


వరద తాకిడికి మున్నేరు పరీవాహక ప్రాంత వాసులను అతలాకుతలం చేశాయి. కొందరి ఇళ్లు కూలిపోగా, విలువైన సామగ్రి మొత్తం కొట్టుకుపోయి నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యాన శుక్రవారం కూడా వీధులు, ఇళ్లల్లో చేరిన చెత్తాచెదారం, మురుగును తొలగించుకునే పనిలో నిమగ్నం కాగా పారిశుద్ధ్య, విద్యుత్ సిబ్బంది శానిటేషన్, విద్యుత్ పునరుద్ధరణ పనులు శరవేగంగా సాగిస్తున్నారు. ప్రభుత్వ సాయంతో పాటు దాతలు వారికి తోచిన సహాయ, సహకారాలు అందిస్తూ వారికి బాసటగా నిలుస్తున్నారు. అయితే అద్దె ఇళ్లల్లో ఉండే కొందరు వామ్మో.. ఇక్కడ ఉండలేమంటూ ఆ ఇళ్లను ఖాళీ చేసి వెళ్తున్నారు. అంతేకాక రహదారులు, పొలాలు దెబ్బతిని కోలుకోలేని పరిస్థితికి తీసుకొచ్చాయి. - సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: మమతరోడ్డులో ధ్వంసమైన రోడ్డు



ఫొటోలను శుభ్రపరుస్తున్న ఓ మహిళ



బొక్కలగడ్డలో విద్యుత్ పునరుద్ధరణ పనులు



ఖమ్మంఅర్బన్: దానవాయిగూడెంలో అద్దె ఇంటిని ఖాళీ చేస్తున్న బాధిత కుటుంబం



పద్మావతినగర్‌లో సామన్లను శుభ్రం చేస్తున్న దృశ్యం

వరద బాధితులను ఆదుకోవాలని ధర్నా

కూసుమంచి: వరదల్లో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని కోరుతూ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యాన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అంతేకాక పాలేరుకు వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి బాధితులకు నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి, నాయకులు వీరయ్య, లక్ష్మయ్య, ఉప్పలయ్య, శ్రీను, కృష్ణయ్య, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని..

కామేపల్లి: తుపాన్ వరద బాధితులను వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యాన తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఆహార పంటలకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు కోలా అప్పారావు, ఆంగోత్ లాలు, కోలా దర్గయ్య, గుగులోత్ బీమ్‌సింగ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు చేసిన వారికే పరిహారం ఇవ్వండి

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని సాగు చేసిన వారికే ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సాగు చేసే వారిలో ఎక్కువగా కౌలు రైతులే ఉన్నారని, వారు పత్తి, వరి తదితర పంటలకు ఎకరానికి రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేశారని పేర్కొన్నారు. పెరిగిన పెట్టుబడులను దృష్టిలో ఉంచుకుని పరిహారాన్ని రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.నిష్పక్షపాతంగా నష్టపోయిన రైతులను ఎంపిక చేసి జాబితాను వెల్లడించాలని ఆయన కోరారు.

వీధులను పరిశుభ్రంగా ఉంచాలి

నేలకొండపల్లి: వరదలతో వీధుల వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం, బురదను త్వరగా శుభ్రం చేయాలని జిల్లా మైనింగ్ ఏడీ, వరదల ఎఫెక్ట్ గ్రామాల శానిటేషన్ మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్.సాయినాథ్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రామచంద్రాపురం, సుర్దేపల్లి, కట్టుకాచారం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దెబ్బతిన్న గ్రామాల్లో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు సిబ్బందిచే శానిటేషన్ చేయించడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక జేసీబీల ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఆయా పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో పరిశీలిస్తున్న ఏడీ సాయినాథ్

వరద బాధితులకు బాసట

వరదలతో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు, ట్రస్ట్‌లు, యువత ముందుకొచ్చి తమకు తోచిన సాయం చేస్తున్నారు. అంతేకాక పాఠశాలల యాజమాన్యాలు, ట్రస్ట్‌ల బాధ్యులు రూ.లక్షల్లో విరాళాలు అందిస్తుండడంపై హర్షం వ్యక్తమవుతోంది. మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో పాల్గొని పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు.

- ఖమ్మంలీగల్: మున్నేరు పరీవాహక ప్రాంతమైన అగ్రహారం, ధంసలాపురంలోని వరద బాధితులకు అడ్వకేట్స్ జేఏసీ ఆధ్వర్యాన శుక్రవారం న్యాయవాదులు నిత్యావసరాలు అందించారు.
- ఖమ్మంమయూరిసెంటర్: వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు ఖమ్మం బస్సు డిపో వద్ద ఆర్‌ఎం సరిరామ్ రైస్ బ్యాగ్‌తో పాటు నిత్యావసరాలను పంపిణీ చేశారు.
- ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ధంసలాపురం, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప, ఎఫ్‌సీఐ గోదాంల ప్రాంతాల్లో 500 కుటుంబాలకు జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన వరద బాధితులకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన పంపింగ్ వెల్‌రోడ్ రాజీవ్ గృహకల్ప, బొక్కలగడ్డ ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతేకాక లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన తుమ్మలగడ్డ ప్రాంతంలో 50 కుటుంబాలకు రూ. 50 వేల విలువైన నిత్యావసరాలు అందించారు. అదేవిధంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన మంచికంటినగర్, బొక్కలగడ్డ తదితర ప్రాంతాల్లో అన్న ప్రసాద వితరణ చేశారు.
- ఖమ్మం మామిళ్లగూడెం: మహిళా శక్తి పార్టీ ఆధ్వర్యాన బొక్కలగడ్డ, మోతీనగర్, పంపింగ్‌వెల్ రోడ్‌లలో రూ.3లక్షలు విలువ చేసే సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, సన్నీ, గుర్రం రాధిక, నలినీ, గుడ్ల మాధవి, శారద, సక్కుబాయి, రాయపుడి అనంతకుమార్, సన్నె ఉదయ్‌ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని మంచికంటినగర్‌లో బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నదానం చేశారు.
- ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని ప్రకాశ్‌నగర్, పంపింగ్‌వెల్‌రోడ్, పెద్దమ్మగుడి, కాల్వొడ్డు, మంచికంటినగర్‌లో వరద బాధితులైన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న 50 మంది శానిటేషన్ సిబ్బందికి ఇగ్నైట్ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యాన నిత్యావసరాలు పంపిణీ చేశారు.
- ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లో సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం వరద బాధిత కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని కరుణగిరి ప్రాంతంలో సుమారు 350 మంది వరద బాధితులకు స్పర్శ సామాజిక అధ్యయన వేదిక, పీసీఎస్ఎస్ నర్సరీ హైదరాబాద్ వారి సంయుక్త సౌజన్యంతో రూ.2 లక్షల విలువైన నిత్యావసరాలు, బియ్యం, దుప్పట్లు, చీరలు, కండువాలు, నోట్ పుస్తకాలు అందించారు.అలాగే జెడ్పీ సీఈఓ దీక్షా రైనా వరద బాధిత మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్స్ అందించారు. అంతేకాక నగరంలోని రైస్ షాపులు అండ్ వర్కింగ్ మెంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బాధితులకు దుప్పట్లు, బియ్యం, దుస్తులు, చీరలు పంపిణీ చేశారు.
- ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంటౌన్ డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు డీఈ నంబూరి రామారావు ఆధ్వర్యాన నగరంలోని అగ్రహారం, బొప్పారం గ్రామాల్లో 600 ఆహార ప్యాకెట్లు అందించారు.
- తిరుమలాయపాలెం: పాలేరు వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా గ్రామస్తులకు తిప్పారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోట్ల ఉపేందర్ ఇంటింటికి 25 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. అలాగే ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన దుప్పట్లు పంపిణీ చేశారు. అంతేకాక తిరుమలాయపాలెం అంగన్‌వాడీ టీచర్ ఇప్పల గీత రూ.6వేల విలువైన పండ్లు, బ్రెడ్లు అందించారు. సయ్యద్ మాదార్ సాహెబ్ ట్రస్ట్, పిండిప్రోలు ఎడ్లపల్లి నవీన్‌లు అన్నదానం చేశారు. కొక్కిరేణి గ్రామానికి చెందిన గద్దల నాగేశ్వరరావు 80 కుటుంబాలకు చీరలు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా రాకాసితండాతో పాటు బంధంపల్లి తదితర ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ చర్యలు, క్లోరినేషన్ తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు రాకాసితండాను సందర్శించి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ముందుకొచ్చి తమకు తోచిన సాయం అందించాలని కోరారు.
- కూసుమంచి: వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు శుక్రవారం నిత్యావసర సరుకులు, మినరల్ వాటర్ పంపిణీ చేశారు. అలాగే నానుతండా, హట్యాతండా, చింతలతండా గ్రామాలకు చెందిన వరద బాధితులకు శ్రీ ఇన్‌ఫ్రా హౌస్సెస్, శ్రీరామచంద్రు, సూర్యా నారాయణ, ఉపేందర్ తదితరులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.
- ఖమ్మంరూరల్: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 200 మంది విద్యార్థులకు తానా ఫౌండేషన్ చైర్మన్ వడ్డేపల్లి శశికాంత్ రూ.1.10 లక్షల విలువైన నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు.మండలంలోని పెదతండాపరిధిలో గల ఆర్‌టీసీ కాలనీలో ఋషి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.



ఖమ్మంలీగల్: నిత్యావసరాలు అందిస్తున్న అడ్వకేట్స్ జేఏసీ నేతలు



ఖమ్మంవన్‌టౌన్: నిత్యావసరాలు అందిస్తున్న స్పర్శ అధ్యయన వేదిక బాధ్యులు



ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ సిబ్బందికి నిత్యావసరాలు అందజేస్తున్న ఆర్‌ఎం



ఖమ్మంమామిళ్లగూడెం: అన్నదానం చేస్తున్న బాలు చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు



ఖమ్మంగాంధీచౌక్: నిత్యావసరాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



తిరుమలాయపాలెం: ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన దుప్పట్ల పంపిణీ

ఎంసీహెచ్‌లో పారిశుద్ధ్య సమస్యకు చెక్



ఎంసీహెచ్ ఎదుట గుంతను మట్టితో పూడ్చిన దృశ్యం



నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్య ప్రభుత్వం రూ.23లక్షలు కేటాయించడంతో పనులు చకచకా జరుగుతున్నాయి. దీంతో ఎన్నాళ్లుగానో వేధిస్తున్న సమస్యకు చెక్ పెట్టినట్లయింది. ఆరేళ్ల క్రితం సుమారు 150 పడకలతో నిర్మించిన ఎంసీహెచ్ భవన నిర్మాణ లోపంతో తరచూ పైప్‌లైన్‌లు లీకవడం, మురుగు నీరు బయటకు ప్రవహించడంతో ఆస్పత్రికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా పైప్ లైన్ లీకవడంతో ఆస్పత్రి ఎదుట పెద్ద గుంత తీసి అందులోకి మురుగునీరు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఆధునికీకరణ పనులు జరుగుతుండడంతో ఆ గుంతను పూడ్చివేసి మట్టి వేయడంతో ఆ ప్రాంతమంతా శుభ్రంగా తయారైంది. ప్రస్తుతం మోటార్ల ద్వారా బయటకు వచ్చే మురుగు నీటిని తరలిస్తున్నారు. కాగా, ఎంసీహెచ్ ఆవరణలో నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంక్‌ను వారం లోగా పూర్తిచేసి ప్రారంభిచనున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు మరమ్మతుకు రూ.10 లక్షలు మంజూరు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదలతో నగరంలోని 35వ డివిజన్ మోతీనగర్‌లో 600 మీటర్ల మేర రోడ్డు మరమ్మతుకు గురైంది. ఈనేపథ్యాన తక్షణమే అంచానాలు రూపొందించి మరమ్మతు చేయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించగా.. కేఎంసీ కమిషనర్ రూ.10 లక్షలను మంజూరు చేసి వెట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. దీంతో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను చేసి, పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.